విజయవంతంగా ‘హోం ఓటింగ్’

- వయోవృద్ధులు, దివ్యాంగులకు సౌలభ్యం
- పోస్టల్ బ్యాలెట్ ద్వారా అవకాశం
- తొలిసారి అమలు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం


అధికారుల సమక్షంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న వృద్ధుడు

భద్రాచలంఅర్బన్: నవంబర్ 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా.. వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేసే ప్రక్రియ సోమవారం నుంచే ప్రారంభమైంది. 119 నియోజకవర్గాల్లో నవంబర్ 27 వరకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించనున్నారు అధికారులు. తెలంగాణలో ఈ సదుపాయం కల్పించడం ఇదే మొదటిసారి. దేశంలోనే ఫస్ట్ టైమ్ ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పద్ధతిని సక్సెస్‌ఫుల్‌గా ఉపయోగించారు ఎన్నికల అధికారులు. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్ద ఓటింగ్ చేపట్టారు. భద్రాచలంలో తొలిరోజు 32 మంది వృద్ధులు, వికలాంగులు 12డీ ఫారంలను బీఎల్వోలకు సమర్పించి ఓటు వేశారు.

ఇదే తొలిసారి..

తెలంగాణలో 80 ఏళ్లు దాటినవారికి ఇంటి నుంచే సదుపాయం కల్పించడం ఇదే తొలిసారి. ఎన్నికల బృందాలు ఫారం–12డీతో అలాంటివారి ఇళ్లకు వెళ్లి ఓటు వేయిస్తారు. వీరు ఎవరికి ఓటు వేస్తున్నారనే గోప్యత పాటిస్తామని, ఈ ప్రక్రియ మొత్తాన్నీ వీడియో తీయిస్తామని ఇప్పటికే ఎన్నికల అధికారులు తెలిపారు. ఇంటి వద్దనే ఓటు వేసే విధంగా ఇప్పటికే అధికారులు సాక్షం అనే యాప్ ద్వారా ఓటర్ల నమోదు చేశారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమయాన్ని కేటాయించారు. రిటర్నింగ్ అధికారులు హోం ఓటింగ్ షెడ్యూల్ వివరాలను అభ్యర్థులకు కూడా తెలియజేశారు. ఈ ప్రక్రియ ద్వారా రెండు రోజుల పాటు ఓటు వేసేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేయగా భద్రాచలం పట్టణంలో ఒక్క రోజులోనే ఈ ప్రక్రియను పూర్తి చేశారు.

రహస్య ఓటింగ్ విధానం..

ఇంటి వద్దనే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఫారం 12డి ద్వారా దరఖాస్తు చేసుకున్న ఓటరు ఇంటికి ఎన్నికల సిబ్బంది మొబైల్ వాహనంలో చేరుకుని ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందజేశారు. అధికారులు నిర్దేశించిన చోట ఓటరు రహస్యంగా తన ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేసి, తమ ఓటును వృద్ధులు, దివ్యాంగులు, ఎన్నికల సిబ్బంది ఉపయోగించుకున్నారు.

ఈ ప్రక్రియలో ఇద్దరు పోలింగ్ అధికారులు, పోలీసు అధికారితోపాటు ఓ వీడియో గ్రాఫర్ సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగింది. ఓటరు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే ప్రక్రియంతా అధికారులు వీడియో తీశారు.

ఇంటి వద్దే ఓటేశారు..

కరకగూడెం: మండలంలో బుధవారం అధికారులు ‘హోమ్ ఓటింగ్’ను నిర్వహించారు. 80 ఏళ్లు పైబడిన ఆరుగురు వృద్ధులు, ఇద్దరు దివ్యాంగులు మొత్తం 8 మంది తమ ఓటుహక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు. వయస్సు పైబడడంతో ఈ సారి ఓటు వేయలేక పోతున్నామని బాధుండేదని అధికారులే ఇంటికి వచ్చి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటు వేయించడం సంతోషంగా ఉందని సదరు ఓటర్లు పేర్కొన్నారు. పోల్ ఆఫీసర్‌గా డిప్యూటీ తహసీల్దార్ సంధ్య, సెక్టర్ ఆఫీసర్‌గా ఎంపీఓ కుమార్, రూట్ ఆఫీసర్, ఆర్ఐ షేక్ హుస్సేన్, కానిస్టేబుల్ దుర్గారావు, పంచాయతీ కార్యదర్శులు విధుల్లో పాల్గొన్నారు.

107కి హోమ్ ఓటింగ్..

మణుగూరురూరల్: పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయలేని వృద్ధులు, వికలాంగుల కోసం ఎన్నికల కమిషన్ ఈ దఫా హోమ్ ఓటింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా 108మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా.. వీరిలో 107మంది బుధవారం నిర్వహించిన హోమ్ ఓటింగ్ ప్రక్రియలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు.

మంచిగా అనిపించింది



తెలంగాణ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అధికారులు నాకు ఇంటి నుంచే అవకాశం కల్పించారు. నిత్యం ఎన్నికలు జరిగిన సమయంలో ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేది. దివ్యాంగురాలైన నాకు ఇలాంటి అవకాశాన్ని కల్పిచడం వల్ల ఎంతో ఆనందం అనిపించింది. మమ్మల్ని ఈ పార్టీకే ఓటు వేయాలని అధికారులు ఎవరూ ఏమీ చెప్పలేదు.

– లక్ష్మి, దివ్యాంగురాలు, కొత్తపేట కాలని, భద్రాచలం

ప్రతిసారీ ఇబ్బంది పడాల్సి వచ్చేది..



ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు పోలింగ్ బూత్ వరకు నడిచేందుకు ఎప్పుడు కష్టపడాల్సి వచ్చేది. కానీ ఈ ఏడాది అధికారులు నేను ఇంటి నుంచే ఓటు వేసే విధంగా వేసులుబాటు కల్పించారు. మాలాంటి వారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరం. ఈ ప్రక్రియను ఇలాగే ఎప్పటికీ కొనసాగించాలి.

– వెంకటేశ్వరరావు, దివ్యాంగుడు, కొత్తపేట కాలనీ, భద్రాచలం

మంచి నిర్ణయం



వయసు రిత్యా అధికారులు నాకు ఇంటి నుంచే నా ఓటును వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. నా వయస్సులో ఉన్న వృద్ధులు నడవలేని స్థితిలో కూడా ఉన్నారు. అలాంటి వారికి ఈ విధంగా ఓటు హక్కుని వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేయడం వల్ల ఎంతో ఉపయోగం.

– కెవి.సత్యనారాయణ, 97 ఏళ్లు, ముదిరాజ్ బజార్, భద్రాచలం

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

భద్రాచలం: రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తప్పకుండా పెన్షనర్ల సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య అన్నారు. భద్రాచలంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో రిటైర్ అయిన ఉద్యోగులను కలిసి పొదెం వీరయ్య ఓట్లను అభ్యర్థించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తాతగుడి సెంటర్, వివిధ కాలనీలలో ప్రచారం జరిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భద్రాచలం అధ్యక్షుడు జి.భూషణ్ రావు, కార్యదర్శి జి.వెంకన్న, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎంఏ ఖాదర్, అరకు మాజీ ఎమ్మెల్యే స్వామి, కాంగ్రెస్ టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు చింతిరాల రవికుమార్, రాజు పాల్గొన్నారు.


పెన్షనర్లతో సమావేశమైన భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య

చేరికలు..

చర్ల: మండలంలోని పెదమిడిసిలేరు గ్రామపంచాయతీలోని గీసరెల్లిలో మంగళవారం 20 కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో పార్టీ టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో తమకు ఒరిగింది ఏమీ లేదని, కాంగ్రెస్‌లో మేలు జరుగుతుందని భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నల్లూరి నగేష్, చిట్టిబాబు, సోడి గోపాల్, శ్యామల శ్రీధర్, శ్యామల గోవింద్ పాల్గొన్నారు.

పదికి పది మావే: రేణుకా చౌదరి


దమ్మపేట: ప్రచారంలో మాట్లాడుతున్న రేణుకా చౌదరి, పక్కన అభ్యర్థి జారె ఆదినారాయణ

దమ్మపేట: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది ఎమ్మెల్యే స్థానాలు తమవే అని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ జాతీయ నాయకురాలు రేణుకా చౌదరి అన్నారు. బుధవారం మండలంలోని నాచారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో రేణుకాచౌదరి మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ కార్యకర్తల జోరు చూస్తుంటే, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా జీరో అవడం ఖాయం అనిపిస్తుందన్నారు. పువ్వాడ అజయ్ అధికార బలం, పోలీసుల అండతో చేసే అరాచకాలకు హద్దే లేకుండా పోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగ పరీక్ష పేపర్ల లీకేజీ, కాళేశ్వరం కూలిపోయిన పరిస్థితిని విమర్శించారు. సోనియా ప్రకటించిన రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు తదితర సంక్షేమ పథకాలు కర్ణాటకలో విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు.

జారేకు మద్దతుగా ప్రచారం..

అనంతరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణకు మద్దతుగా నాచారం గ్రామంలో ప్రచార రథంపై రేణుకా చౌదరి ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. తన రాకతో సందుల్లో దాక్కున్న బీఆర్ఎస్ నాయకులకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. మెచ్చాకు మచ్చపడిందని, భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకే ఓటేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కోటగిరి సత్యంబాబు, అలపాటి ప్రసాద్, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, ఎల్లిన మురళీ, కెవి.సత్యనారాయణ, వలీపాషా, యర్రగొర్ల రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలు తప్పకుండా అమలు చేస్తాం..

దమ్మపేట: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను తూచ తప్పకుండా అమలు చేస్తామని అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ వెల్లడించారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో జారే విస్తృతంగా పర్యటించారు. ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ, వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తూ ముందుకు కదిలారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. గత పది సంవత్సరాలుగా నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఏదోరకంగా సేవ చేస్తున్న తనను ఆశీర్వదించి, ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు కోటగిరి సత్యంబాబు, అలపాటి ప్రసాద్, రావు గంగాధరరావు, మద్దిశెట్టి సత్యప్రసాద్, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆ వ్యాఖ్యలు హాస్యాస్పదం

గుండాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన పోడు పట్టాలు పనికిరావని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు మాట్లాడడం హాస్యాస్పదమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో తిరిగిన పాయం గ్రామాల్లో పోడు పోడుభూముల పట్టాలు చిత్తుకాగితాలతో పోల్చడం సరైంది కాదన్నారు. గతంలో బీఆర్ఎస్ పాయం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పోడు భూముల పట్టాలు కేసీఆర్ ద్వారా రైతులకు అందిస్తామని ప్రజలు హామీ ఇచ్చినప్పుడు తమరికి తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇలాంటి తప్పుడు ఆరోపనలు చేయడం మానుకోవాలని సూచించారు. సమావేశంలో టి.రాముల, నిట్టా రాములు, లక్ష్మీనారాయణ, రాంబాబు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఓ కార్యాలయంలో ధృవీకరించుకోవాలి

భద్రాచలంటౌన్: గత నెల నుంచి పెన్షన్ రాని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు స్థానిక ఎస్టీఓ కార్యాలయంలో ధృవీకరించుకోవాలని ఆల్ పెన్షన్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెన్షన్ రాని వారు వారి ఫ్యామిలీ పెన్షన్ ఐడీ నెంబర్ తెలియజేయాజేస్తే అక్టోబర్ నెలకు సంబంధించిన ఐఆర్ కలిపి వస్తుందని ఆయన పేర్కొన్నారు. పెన్షన్ రానివారు వెంటనే భద్రాచలం ఎస్టీఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

కార్తీక వనసమారాధన

దమ్మపేట: మండల పరిధిలోని గట్టుగూడెం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో కార్తీక వనసమారాధనను నిర్వహించారు. బుధవారం గట్టుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కోటగిరి సత్యంబాబు, ఆయన వ్యవసాయ క్షేత్రంలో సకల జనులకు కార్తీక వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యంబాబు మాట్లాడుతూ.. గట్టుగూడెం పరిసర ప్రాంత ప్రజలకు వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేశానని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరైనట్లు తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

చర్ల: ఈ నెల 30న జరిగే శాసన సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని చర్ల సీఐ బి.రాజగోపాల్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే అల్లర్లు సృష్టించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని వెల్లడించారు.

వైద్యశిబిరం విజయవంతం

కరకగూడెం: మండలంలోని కుర్నవల్లి గ్రామంలో బుధవారం కరకగూడెం ఆయుర్వేద వైద్యాధికారి సీహెచ్.కుమార స్వామి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సుమారు 80 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం సరికాదు..

అశ్వాపురం: గత రెండు రోజులుగా కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నానని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలో నిజం లేదని, బీఆర్ఎస్ పార్టీలోని కొందరు చేస్తున్న ఈ అసత్యప్రచారాలను ఖండిస్తున్నానని నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మొండికుంటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

టీకాల పంపిణీ

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట, బాపనకుంట గ్రామాల్లో, పలు ఆరోగ్య ఉపకేంద్రాల్లో మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు నిశాంత్‌రావు సందర్శించి వ్యాక్సినేషన్ తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. టీకాలను సరైన సమయంలోనే వేయాలని తెలిపారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, రాధ, రమాదేవి పాల్గొన్నారు.

పార్టీల ప్రచారాలు.. ర్యాలీలు

అన్నపురెడ్డిపల్లి: మండలంలో బీజేపీ బలపరిచిన జనసేన అభ్యర్థి ఉమాదేవి బుధవారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జనసేన, బీజేపీ కార్యకర్తలు నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, కిషోర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ఎన్నికల్లో సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్యను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు కోరారు. బుధవారం మండలంలోని గ్రామాల్లో ఓట్లు అభ్యర్థించి మాట్లాడారు. సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.

మండలంలోని బండిరేవు గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన వారు బుధవారం బీఆర్ఎస్‌లో చేరగా వారికి భద్రాచలం బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క అవకాశం ఇస్తే మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సర్పంచ్ మట్టా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: పలు గిరిజన గ్రామాల్లో బుధవారం అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సర్పంచ్ నారం రాజశేఖర్, పాడియం సత్యవతి, ఎంపీటీసీలు, నాయకులు మందపాటి మోహన్ రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అండర్–14 జిల్లా జట్టుకు భద్రాద్రి విద్యార్థి

భద్రాచలంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి అండర్–14 బాలుర క్రికెట్ జట్టుకు తమ పాఠశాల విద్యార్థి నక్కా రిత్విక్ ఎంపికయ్యాడని క్రాంతి విద్యాలయం కరస్పాండెంట్ సమత శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి జట్టు ఎంపిక 100 మంది విద్యార్థులు పాల్గొనగా రిత్విక్ తన ప్రతిభ చాటి జట్టులో చోటు సాధించిన్నట్లు ఆమె పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది రుత్విక్‌ను అభినందించారు.

కాంగ్రెస్ వస్తేనే అభివృద్ధి


గుండాల: ఎన్నికల ప్రచారంలో ప్రజలతో పాయం వెంకటేశ్వర్లు


మణుగూరుటౌన్: సీపీఐ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మిక వాడల్లో ప్రచారం..

గుండాల: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి జరుగుతుందని, ఓటర్లు హస్తం గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని ఆ పార్టీ పినపాక ఎమ్మెల్యే అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆళ్లపల్లి మండలంలో పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేస్తామన్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించింది, ఉచిత కరెంటు అమలు చేసింది, పోడు పట్టాలలతో పాటు అనేక పథకాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. నేడు మళ్లీ అధికారంలోకి తీసుకువస్తే మరెన్నో పథకాలతో పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బట్టా విజయ్ గాంధీ, రాంనర్సయ్య, తాళ్లపల్లి వెంకన్న, ఎండీ అతహార్, గౌరబోయిన సుబ్బారావు, సీపీఐ నాయకులు రేసు ఎల్లయ్య, గొగ్గెల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వాడల్లో ప్రచారం..

మణుగూరుటౌన్: కార్మికుల సంక్షేమం, బొగ్గు బాయిల పరిరక్షణ, కాంట్రాక్ట్ కార్మికుల మెరుగైన వేతనాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, బీఆర్ఎస్ మాటలు కాగితాలకు, హామీలకు మాత్రమే పరిమితమని కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కార్మిక వాడల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. బుధవారం సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కార్మికులు నివసించే పీవీకాలనీలో పర్యటించారు. ఎంసీ క్వార్టర్లలో ప్రచారం చేస్తూ కార్మికులకు ఇచ్చిన ఆదాయపు పన్ను మినహాయింపు హామీపై 10 సంవత్సరాలు గడిచినా బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న కేసీఆర్ మౌనమే వహిస్తున్నారని వివరించారు. పాయంకు ఓటేయాల్సిందిగా అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు త్యాగరాజన్, వెలగపల్లి జాన్, వెంకటరత్నం, ఏఐటీయూసీ నాయకులు రాంగోపాల్, సుభానీ, వెంకటేశ్వర్లు, కేసీహెచ్‌పీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, నామా వెంకటేశ్వర్లు, గట్టయ్య, తిరుపతిరెడ్డి, సుబ్బారెడ్డి, స్థానిక ప్రతినిధులు, గుడిపూడి కోటేశ్వరరావు, శ్వేతన్, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగేందుకు గెలిపించాలి..

అశ్వాపురం: పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పినపాక నియోజకవర్గంలో అన్ని గ్రామాలూ అభివృద్ధి బాట పట్టాయని, ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగించేందుకు కారు గుర్తుపై ఓట్లు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రేగా కాంతారావు కోరారు. మండలంలో బుధవారం ఎమ్మెల్యే రేగా కాంతారావు ఉదయం నుంచి రాత్రి వరకు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, ఓటు వేసి గెలిపించాలని రేగా ఓటర్లను కోరారు. గ్రామాలలో ప్రచారానికి వెళ్లిన రేగాకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. మహిళలు, నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అశ్వాపురం: జగ్గారంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు

బీఆర్ఎస్‌తో ప్రజలకు మేలు

మణుగూరురూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని ఆ పార్టీ పినపాక నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బుద్దరాజు నవీన్‌బాబు అన్నారు. బుధవారం జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రేగా కాంతారావును గెలిపించాలని కోరుతూ.. పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నవీన్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేరుతున్నాయన్నారు. కారు గుర్తుపై ఓటేసి రేగాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మడి వీరన్నబాబు, సకిని బాబురావు, వీరపనేని చెన్నకేశవులు, గంజి నరేంద్ర, బర్మావత్ నర్సింహరావు, బోడ బీరమ్మ, పెద్దాడి ప్రసాద్, గద్దల నాగలక్ష్మి, నాగభూషణం, ఏనిక సారయ్య, రాంబాబు, మునేష్, నాగేంద్రబాబు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎంపీపీ రేగా కాళిక విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ పినపాక అభ్యర్థి రేగా కాంతారావును అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మేనిఫెస్టోలను పంపిణీ చేస్తు కారు గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుడ్ల రంజిత్ కుమార్, ప్రశాంత్, సమ్మయ్య పాల్గొన్నారు.